క్లుప్తంగా

సకల శుభాలు చేకూరాలి

• ఎమ్మెల్యే రెడ్డి శాంతి



ఎల్.ఎన్.పేట: ప్రజలకు సకల శుభాలు చేకూరాలని పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి ఆకాంక్షించారు. నియోజకవర్గంలోని రైతులు, వ్యాపారులు, పోలీసులు, ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగులు, విద్యార్థులు, మహిళలు, దివ్యాంగులు, కొండ పోడునే నమ్ముకుని జీవనం సాగించే గిరిజనులతో పాటు అన్నివర్గాల వారికి సంక్రాంతి, కనుమ పండుగ శుభాకాంక్షలు తెలియజేస్తూ తన క్యాంపు కార్యాలయం నుంచి ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు.

అనంత పద్మనాభ స్వామికి ప్రత్యేక పూజలు



పూజలందుకుంటున్న స్వామివారు

జలుమూరు: ప్రసిద్ధ శైవ క్షేత్రం శ్రీముఖలింగం ఆలయ క్షేత్ర పాలకుడు శ్రీమహావిష్ణువు. వీటి పరిధిలో ఉన్న అనంత పద్మనాభ కొండపైన వెలిసిన పద్మనాభ స్వామికి భోగిని పురస్కరించుకొని ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. కనుమ రోజున కొండపై ఉన్న కృష్ణార్జునులకు ఉత్సవాలు నిర్వహించి జాతర చేస్తారు.

అశ్వ వాహనంపై వెంకటేశ్వరస్వామి తిరువీధి



అశ్వ వాహనంపై ఉత్సవ మూర్తులు

సారవకోట: చీడిపూడి వెంకటేశ్వర స్వామి ఉత్సవ విగ్రహాలను శనివారం రాత్రి అశ్వ వాహనంపై తిరువీధి నిర్వహించారు. ఆలయంలో జరుగుతున్న ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా ఆలయంలో ప్రత్యేక, విశేష పూజలు నిర్వహించి రాత్రి చీడిపూడి, బుడితి, అవలింగి గ్రామాల్లో కన్నుల పండుగగా తిరువీధి జరిగింది.

భక్తి శ్రద్ధలతో గీతా పారాయణం



గీతా పారాయణంలో భక్తులు

బూర్జ: అన్నంపేట గ్రామంలోని కాశీవిశ్వేశ్వర దేవాలయంలో గీతా పారాయణం కార్యక్రమాన్ని ఆధ్యాత్మిక గురువు కె.రామ్మోహననాయుడు ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. ధనుర్మాసం సందర్భంగా హరే కృష్ణ.. హరేరామ భక్తులు ముగింపు కార్యక్రమం సందర్భంగా ఈ కార్యక్రమం జరిగింది. ప్రవచన కర్తలు గీతా పారాయణంలో అధికసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

శ్రీముఖలింగంలో దుస్తులు పంపిణీ



దుస్తులు పంపిణీ చేస్తున్న దృశ్యం

జలుమూరు: శ్రీముఖలింగానికి చెందిన నాయుడుగారి తవిటినాయుడు జ్ఞాపకార్థం 'నాయుడు' ఫౌండేషన్ ద్వారా భోగి సందర్భంగా ఆదివారం అనాథులు, వృద్ధులకు చీరలు, దుప్పట్లు, పండ్లను పంపిణీ చేశారు. ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు నాయుడుగారి రాజశేఖర్, ఉపాధ్యక్షుడు శైలజ, శృతి ఉన్నారు.

పూర్వ విద్యార్థుల ఔదార్యం



పుండరీకాక్షయ్యతో పూర్వ విద్యార్థులు

బూర్జ: బూర్జ జెడ్పీ హైస్కూల్‌లో 1998 సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు తమ ఔదార్యాన్ని చాటుకున్నారు. వారితో కలిసి చదువుకున్న పూర్వ విద్యార్థి సూర పుండరీకాక్షయ్య అనారోగ్యానికి గురయ్యాడు. దీంతో ఆదివారం కాక్షయ్యను కలిసి రూ. 50 వేలు ఆర్థిక సాయం చేసి అండగా నిలిచారు.

వైఎస్సార్‌సీపీ నాయకుడికి సత్కారం



సూర్యారావుని సత్కరిస్తున్న దృశ్యం

సరుబుజ్జిలి: చినకాగితాపల్లికి చెందిన వైఎస్సార్‌కాంగ్రెస్ పార్టీ నాయకుడు మునకాల సూర్యారావుని స్థానిక ఆటో యూనియన్ సభ్యులు ఆదివారం సత్కరించారు. పండుగ కోసం వచ్చే ప్రజలు ఇబ్బందులు పడకుండా సరుబుజ్జిలి నుంచి వీరభద్రాపురం వరకు రహదారి గుంతలను సూర్యారావు తన సొంత నిధులతో పూడ్చివేయించారు. దీనికి కృతజ్ఞతగా ఆటో డ్రైవర్లు ఆయన్ని అభినందించి సత్కరించారు.

సంక్రాంతి తెచ్చింది సందడి



సారవకోట: మండల కేంద్రంలో భోగి మంటలో పిడకలు వేస్తున్న చిన్నారులు



నరసన్నపేట: ఇందిరానగర్‌లో భోగి మంట వద్ద మహిళలు



బూర్జ: దొంకలపర్త గ్రామంలో ఎగసిపడుతున్న భోగిమంట



ఆమదాలవలస: మోనింగివారివీధి భవిత పాఠశాల వద్ద భోగి సందడి



పొందూరు: రాపాకలో భోగి మంటను కాగుతున్న స్థానికులు



హిరమండలం: 180 అడుగుల పొడవుగల భోగి పిడకల దండను తీసుకొస్తున్న పిల్లలు



కొత్తూరు: మెట్టూరు బిట్-1 నిర్వాసిత కాలనీలో భోగి మంట

• భోగితో సందడి ఆరంభం

పల్లెగూడికి పండుగ వచ్చింది. సంక్రాంతి సంబరాలు భోగి మంటలతో ప్రారంభమయ్యాయి. ఆదివారం ఉదయం అన్ని గ్రామాల్లో భోగి మంటల సందడి మొదలయింది. మహిళలు ఇళ్ల ముందు రంగవల్లికలు వేసి సూర్యోదయానికి స్వాగతం పలికారు. ఎక్కడెక్కడో ఉన్న బంధువులు, గ్రామస్తులు స్వగ్రామాలకు చేరుకొని వేడుకల్లో పాలుపంచుకున్నారు. ఆమదాలవలస, నరసన్నపేట, పాతపట్నం నియోజకవర్గాల్లో భోగి పండుగను వైభవంగా జరుపుకున్నారు. పెద్దపెద్ద మంటలు వేసి అందులో పేడతో చేసిన పిడకలు, కట్టెలను వేసి సందడి చేశారు. పలు గ్రామాల్లో సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. అలాగే ఆలయాల్లో ప్రత్యేక పూజా కార్యక్రమాలు జరిగాయి. కాగా సోమవారం సంక్రాంతి పర్వదినాన్ని వైభవంగా జరుపుకోవడానికి కావాల్సిన ఏర్పాట్లను సైతం అన్ని కుటుంబాలు సిద్ధం చేసుకున్నాయి.



హిరమండలంలో భోగి మంట వేస్తున్న ప్రజలు



సరుబుజ్జిలి: పురుషోత్తపురంలో భోగి వేడుకల్లో యువత

17న శ్రీరాంపాడు యాత్ర



కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న సర్పంచ్‌లు

నరసన్నపేట: అంప్లాం, గొట్టిపల్లి మధ్య బసివలస రోడ్డుకు ఆనుకొని శివాలయం వద్ద నెల 17న హలహలేశ్వరుని(శ్రీరాంపాడు) యాత్ర నిర్వహించనున్నారు. ఈ విషయాన్ని సత్యవరం, గొట్టిపల్లి సర్పంచ్‌లు అల్లు అశిరినాయుడు, అవ్వ రవీంద్ర ఆదివారం తెలిపారు. మధ్యాహ్నం ఒంటి గంట నుంచి సాయంత్రం ఆరు గంటల వరకూ జాతర జరుగుతోందన్నారు. ఈ మేరకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు. ఆదివారం యాత్ర ప్రదేశం వద్ద నిర్వహణ కమిటీ విలేకర్లకు వివరాలు వెల్లడించారు. 16వ శతాబ్దం నుంచి ముక్కనుమ రోజున యాత్ర నిర్వహించడం ఆనవాయితీ అన్నారు. ఈ సందర్భంగా యాత్ర కరపత్రాన్ని సర్పంచ్‌లు ఆవిష్కరించారు. కమిటీ సభ్యుడు శిమ్మ లక్ష్మణరావు ఉన్నారు.

17న రక్తదాన శిబిరం

ఆమదాలవలస రూరల్: కణుగులవలస గ్రామంలో స్వర్గీయ బొడ్డేపల్లి రామజోగినాయుడు శతజయంతి వేడుకలు సందర్భంగా ఈ నెల 17న రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్లు డీసీసీబీ డైరెక్టర్ బొడ్డేపల్లి నారాయణరావు ఆదివారం తెలిపారు. ఆసక్తి ఉన్నవారు స్వచ్ఛందంగా రక్తదానం చేసి ఆదర్శంగా నిలవాలని కోరారు.

గాజులకొల్లివలసలో సంకల్పయాత్ర



హెల్త్ కార్డులు పంపిణీ చేస్తున్న దృశ్యం

ఆమదాలవలస రూరల్: సమాజంలో మహిళలు స్వయం సమృద్ధి సాధించే దిశగా నారీ సంకల్పశక్తికి కేంద్ర ప్రభుత్వం ప్రోత్సాహం అందజేస్తుందని బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పేడాడ సూరపునాయుడు అన్నారు. గాజులకొల్లివలస గ్రామంలో వికసిత్ భారత్ సంకల్ప యాత్రను ఆదివారం నిర్వహించారు సంక్షేమ పథకాలను అర్హులందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన కిసాన్ యోజన, జనాధన్ ఖాతాలు, అటల్ పెన్షన్ యోజన వంటివి అర్హులు పొందాలని సూచించారు. సర్పంచ్ మొండేటి కూర్మారావు, ఏపీఎం పైడి కూర్మారావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఒకే వేదికపై పూర్వ విద్యార్థులు



ఒకేవేదికపై పూర్వవిద్యార్థులు

ఆమదాలవలస: ఆమదాలవలస ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 1996–98 విద్యా సంవత్సరంలో ఇంటర్మీడియెట్ చదువుకున్న పూర్వ విద్యార్థులు ఒకేచోట ఆదివారం కలుసుకున్నారు. సుమారు 28 ఏళ్ల తరువాత చదువుకున్న కళాశాలలోనే కలుసుకున్న వీరాంతా కష్టసుఖాలను పంచుకున్నారు. ఈ శుభ సందర్భంగా అనాథలకు పండ్లు, వస్త్ర దానం చేశారు. అలాగే అనాథ ఆశ్రయానికి పది ఫ్యాన్లు వితరణ చేశారు. సమాజ సేవలో ముందంజలో ఉందామని ప్రతిజ్ఞ చేశారు. గ్రూపు ఫొటో తీసుకొని మురిసిపోయారు. పూర్వ విద్యార్థులు గోండు తవిటినాయుడు, పేడాడ రామకృష్ణ, కూన విక్రం, బలగ శ్రీనివాసరావు, బాలమణి, భారతి, సునీత, శివ ఉన్నారు.

వైభవంగా గోదా రంగనాథుల కల్యాణం



కొత్తూరులోని సీతారామ ఆలయంలో గోదాదేవి, రాంగనాయకులకు కల్యాణం

ధనుర్మాస ఉత్సవాల ముగింపు సందర్భంగా పలు ఆలయాల్లో ఆదివారం గోదా రంగనాథుల కల్యాణోత్సవాలు అంగరంగ వైభవంగా జరిగాయి. నెలరోజుల పాటు నిర్వహించిన తిరుప్పావై ప్రవచనాలు ముగిశాయి. రోజుకొక పాశుర పారాయణలతో ధనుర్మాస వ్రతాలను నిర్వహించిన భక్తులు గోదా రంగనాథుల విగ్రహాలను ఉంచి పూలతో అలంకరించి పూజలు చేసి కల్యాణ వేడుకలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



నరసన్నపేట: గోదారంగనాథ స్వామి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు



పాతపట్నం వెంకటేశ్వర ఆలయంలో గోదారంగనాథ కల్యాణోత్సవం



సరుబుజ్జిలి: గోదారంగనాథుని కల్యాణం జరిపిస్తున్న అర్చకుడు యతిరాజుదాసు



సరుబుజ్జిలి: రావివలసలో అన్నసమారాధన

అంబేడ్కర్ స్మృతి వనం అపూర్వం



వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న హైమావతి తదితరులు

నరసన్నపేట: ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా విజయవాడ స్వరాజ్ మైదానంలో నిర్మించిన అంబేడ్కర స్మృతివనం అపూర్వమని పొందర, కూరాకుల కార్పొరేషన్ ఛైర్‌పర్సన్ రాజాపు హైమావతి అన్నారు. స్థానిక వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ నాయకులతో కలిసి ఆదివారం విలేకరులతో మాట్లాడారు. రూ. 400 కోట్లతో నిర్మించిన స్మృతి వనాన్ని ఈ నెల 19వ తేదీన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహనరెడ్డి ప్రారంభిస్తారన్నారు. నరసన్నపేట నుంచి పెద్ద ఎత్తున పార్టీ అభిమానులు, ఎస్సీ సంఘ నాయకులు, కార్యకర్తలు హాజరు కావాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా స్మృతివనం వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. సమావేశంలో నాయకులు రాజాపు అప్పన్న, కేసీహెచ్‌బీ గుప్త, బొబ్బాది ఈశ్వరరావు, ఎస్సీ సంఘ నాయకులు సతివాడ రామినాయుడు, ముచ్చ గనేష్, కోటిపల్లి శ్రీను, డేవిడ్ ఉన్నారు.

గిరిజన నృత్యాలతో సందడి



సారవకోటలో నెయ్యిగుర్రం ప్రదర్శన ఇస్తున్న గిరిజనులు

సారవకోట: సంక్రాంతి పండుగను పురస్కరించుకొని గిరిజనులు తమ సంప్రదాయ నృత్యాలతో గ్రామాల్లో అలరించారు. పురుషోత్తుకర్ర, రైవాడ, జగన్నాథపురం, కోనవానిపేట, బురుజువాడ తదితర గ్రామాలకు చెందిన గిరిజనులు నెయ్యిగుర్రం, దెయ్యం ముఖం వేషాలతో ఇచ్చిన నృత్య ప్రదర్శనలు స్థానికులను అలరించాయి. పలు గ్రామాలలో వీరు ప్రదర్శనలు నిర్వహించి విరాళాలు సేకరించి కొండదేవత ఉత్సవాలు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు.

16న ఆలయ వార్షికోత్సవం



ఉజ్జయిని మహాకాళి ఆలయం

సారవకోట: మండల కేంద్రం సారవకోటలోని ఉజ్జయిని మహాకాళి ఆలయ 22వ వార్షికోత్సవాన్ని మంగళవారం నిర్వహించనున్నట్లు అర్చకులు వల్లభరాయుడు తెలిపారు. ఆలయం ప్రతిష్ఠించిన నాటి నుంచి ఏటా కనుమ పండుగ రోజున వార్షికోత్సవం నిర్వహిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, సామూహిక కుంకుమార్చన పూజలు ఉంటాయన్నారు. ఆలయాన్ని ప్రత్యేకంగా విద్యుత్ దీపాలతో అలంకరించారు. సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు.

నేడు కాలేజీ గ్రౌండ్‌లో సంక్రాంతి సంబరాలు

నరసన్నపేట: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో సంక్రాంతి సంబరాలు సోమవారం జరగనున్నాయి. కళింగకోమట్ల సంఘం ఆధ్వర్యంలో సంబరాలను నిర్వహిస్తున్నట్లు సంఘం కోశాధికారి పొట్నూరు సాయిబాబు ఆదివారం తెలిపారు. సాయంత్రం నాలుగు గంటల నుంచి కార్యక్రమాలు ప్రారంభమవుతాయని.. సభ్యులంతా హాజరై విజయవంతం చేయాలని కోరారు.